పడుకున్నాడు. హిందూ భక్తులందరూ ఊపిరి పీల్చుకున్నారు.

*(298) " వెళ్లు ! ఇంటికి వెళ్లి, నీ పిల్లలతో సంతోషంగా తిను. కానీ మధ్యలో పొట్లం తెరచి చూడకు !"*

ఒక పేద బ్రాహ్మణుడు బాబాను దర్శించి, తను చాలా దుర్భర పరిస్థితులలో వున్నాడని, తనకేదైనా సహాయం చెయ్యమని బాబాను అర్థించాడు. బాబా కరుణించి, అతనికొక పొట్లమిచ్చి, "వెళ్ళు ! ఇంటికి వెళ్లి నీ పిల్లలతో సంతోషంగా తిను. కానీ మధ్యలో పొట్లం తెరచి చూడకు!" అని ఆదేశించారు. బ్రాహ్మణుడు సంతోషంగా పొట్లం తీసికొని, ఇంటికి బయలుదేరాడు. కానీ అతనికి ఆ పొట్లంలో ఏముందో చూడాలనే కుతూహలం ఎక్కువ కాసాగింది. బాబా మాటలు అలక్ష్యం చేసి, ఒక సెలయేటి ఒడ్డున కూచుని, పొట్లం విప్పాడు. అందులో పచ్చిమాంసముంది. మాంసాన్ని చూచి, జుగుప్స చెంది, ఛీత్కారం చేస్తూ, ఆ పొట్లాన్ని ఏట్లోకి విసిరివేశాడు. ఆ మాంసపు ముద్ద నీటికి తగిలిన వెంటనే బంగారంగా మారి, తళ తళ మెరుస్తూ ఏటిలో మునిగిపోయింది. ఇది చూచి బ్రాహ్మణుడు నిర్ఘాంతపోయాడు. బాబా దయతో యిచ్చిన బంగారాన్ని తను దక్కించుకోలేకపోయినందుకు చింతించాడు. దీనిని బట్టి మహాత్ములెంత దయ తలచినా, భక్తులలో విశ్వాసం లోపించినప్పుడు, ఫలితం దక్కదని తెలుస్తుంది.

*(299) "బొమ్మలెందుకు ఎత్తుకెళ్లారు? మొత్తం పల్లకినే ఎత్తుకుపోవాల్సింది!"*

భక్తులు బాబాకు వెండి పల్లకి నొకదానిని బహూకరించారు. బాబా



ఖరీదైన కానుకలంటే ఇష్టపడేవారు కాదు. బాబా తమకు వచ్చిన కానుకలన్నీ భక్తులకే తిరిగి యిచ్చేవారు. కానీ పల్లకి విషయంలో అలా చేయడం కుదరదు కదా ! అందువల్ల వారు దాని విషయమే పట్టించుకోలేదు. వెండిపల్లకికి బిగించివున్న వెండి గుర్రాలు, బొమ్మలు దొంగలెత్తుకు పోయారు. భక్తులు బాధపడుతూ, ఈ విషయాన్ని బాబాకు విన్నవించారు. అప్పుడు బాబా, "బొమ్మలెందుకు ఎత్తుకుపోయారు? మొత్తం పల్లకినే ఎత్తుకెళ్ళాల్సింది" అన్నారు. ఇది విని భక్తులు విచలితులయ్యారు. ఇది ఆస్తిపాస్తులపై బాబాకున్న విముఖత తెలియజేస్తుంది.

*(300) "పసిబిడ్డ తొడమీద మలం విసర్జిస్తే బిడ్డను చంపుకుంటామా? లేక తొడను నరుక్కుంటామా? సహించి తీరవలసినదే కదా !"*

ఆదిరించే దిక్కులేక బయటపడివున్న వెండి పల్లకి బొమ్మలు దొంగలెత్తుకపోయిన తర్వాత, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని భక్తులు అనుకున్నారు. మశీదు ప్రక్కనే రేకుల షెడ్డొకటి నిర్మించి, దానిని భద్రపరచాలని అనుకున్నారు. షెడ్డు నిర్మించడానికి మశీదు గోడలకు కన్నాలు వేయాలి. దీనికి బాబా అనుమతి లభించదని భక్తులకు తెలుసు. అందువల్ల ఈ పనిచేయడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. కానీ బాబా అంకితపుత్రుడైన పురందరే పూనుకున్నాడు. ఈ పని చేస్తున్నప్పుడు బాబా లెండీనుండి తిరిగివచ్చి, నానా రభస చేశారు. మశీదు గోడలకు కన్నాలు వేస్తున్నందుకు పురందరేను తిట్టారు, కొట్టారు. బయటకి గెంటివేశారు. పురందరే బాబా తిట్లను, దెబ్బలను ఆశీర్వాదాలుగా భావించి, సహించి,

మశీదుకు తిరిగివచ్చి, ఆ పనిని కొన సాగించాడు. బాబా ఎంత నిరోధించినా, తన పని ఆపలేదు. ఇక చేసేదేమీ లేక బాబా ఊరకుండిపోయడు. ఇలా ఉదయం నుండి మధ్యాహ్నం రెండు గంటలవరకు పనిచేస్తూనే వున్నాడు. బిడ్డ అన్నం తినకుండా పనిచేస్తున్నాడని బాబా తల్లి హృదయం తల్లడిల్లింది. "వెళ్ళి భోంచేసి రమ్మ"న్నారు బాబా. వెళితే, తను చేసిన పనంతా, బాబా తారుమారు చేస్తారని భయపడి పురందరే వెళ్లలేదు. ఇతర భక్తుల చేత చెప్పించారు. తాము బ్రతిమాలాడారు. కానీ పురందరే చలించలేదు. బిడ్డ అన్నం తినకుండ పనిచేస్తున్నాడనే తపన ఎక్కువైంది. చివరకు పురందరే చేసిన పనికదపనని, యథాతథంగా ఉంచుతానని, బాబా హామి యిచ్చిన తరువాత పురందరే ఇంటికి వెళ్లాడు. అతడు వెళ్ళిన తర్వాత బాబా భక్తులతో, "ఏం చేయాలి? పసిబిడ్డ తొడమీద మలం విసర్జిస్తే, బిడ్డను చంపుకుంటామా? లేక తొడను నరుక్కుంటామా? ఓర్చుకొని ఉండవలసినదే" అన్నారు. తల్లి తండ్రులు తమ బిడ్డలు, తమను లక్ష్యపెట్టకుండ చేయరాని పనులు చేసినా, సహించి ఊరుకుంటారే కానీ శిక్షించరు కదా ! అలాగే పురందరే బాబా మాటలు వినకుండ తన ఇష్టప్రకారం ప్రవర్తించినా, బాబా సహించి ఊరుకుంటారే తప్ప శిక్షించరని దీని భావం.



(ఇంకా ఉంది)



# ద్వారకామాయి


- రావూజీ



- 'ద్వారకామాయి'లో మీరు కూర్చుని ధ్యానంచేస్తే ద్వారకామాయి తమ బిడ్డల ప్రమాదాలను, ఆందోళనలను తుడిచి వేస్తుంది. ఈ 'మసీదు ఆయి' అత్యంత కరుణామాయి. ఆమె యందు పరిపూర్ణ విశ్వాసాన్ని ఉంచినవారికి మాతృమూర్తి. వారు ప్రమాదాలలో నున్నప్పుడు ఆమె వారిని కాపాడుతుంది. ఆమె ఒడిలో నున్నవారికి కలిగే కష్ట, నష్టాలన్నీ దూదిపింజల్లా తేలి పోతాయి.
- ఇది మసీదు కాదు ద్వారక. ఆమెను శరణుజొచ్చిన వారికెన్నటికి హాని కలుగదు.
- ఈ ద్వారకామాయి మెట్లెక్కిన తక్షణమే కర్మవల్ల కలిగిన పాపఫలములు మాయమై ఆనందం ప్రారంభమౌతుంది. ఆ భగవానుడు కరుణామయుడు. మీ సమస్త బాధలను తొలగించి మీకు విముక్తి కల్గిస్తాడు.
- ఎవరైనా ద్వారకామాయి లోనికి అడిగిడితే చాలు ! వారు ధ్యేయాన్ని సాధించినట్లే !
- ఈ 'ద్వారకామాయి' స్థలము భక్తుల రక్షణకే గాని వారి సంహారానికి కాదు. ద్వారకామాయి అన్నా 'మసీదు ఆయీ' అన్నా సాయి అని అర్థం.

# శ్రీలలితా సహస్రనామములు(అర్ధసహితము)

(గతసంచిక తరువాయి భాగం)- **యఱ్ఱమిల్లిసరోజినిజోగారావు.**



**148.“ఓం నిత్యశుద్ధాయై నమః”** నిత్యశుద్ధసత్త్వస్వరూపిణి. సృష్టిస్థితి లయములందు, శుద్ధ శాంత సౌమ్యమై, శుద్ధపరాత్పర పరబ్రహ్మస్వరూపిణి, నిత్యము ప్రకాశించును.

**149.“ఓం నిత్యబుద్ధాయై నమః”** : చిత్స్వరూపజ్ఞానానందమూర్తి, సకల ప్రాణచైతన్యస్వరూపిణి, నిత్యమూ జాగ్రదావస్థలో వుండి, భక్తహృదయాలలో మాయవరణ తొలగించి, జ్ఞానమును జాగృతము చేయును.

**150.“ఓం నిరవద్యాయై నమః”** : అవద్యము అనగా నరకబాధ. లింగపురాణంలో ఈశ్వరారాధనచేయనివారికి 28 కోట్ల అవద్యనరకబాధలు కలుగునని, లింగపురాణంలో, గరుడపురాణంలో మరణించిన తర్వాత జీవుడు పూర్వజన్మసుకృతమున ఎన్ని బాధలు పడాలో వివరిస్తారు. తన భక్తుల అజ్ఞాన, అవిద్యలను తొలగించి, సర్వపాపములనుండి విముక్తులజేయు శ్రీనిరవద్యకు, ఆత్మసాక్షాత్కార నమస్కారము.

**151.“ఓం నిరన్తరాయై నమః”** : సకలజీవుల అంతరమున, నిరంతరము ఆత్మజ్యోతియై వెలుగు నిత్య సత్యస్వరూపిణికి, అంతరంగముల భేదము లేక వెలుగు శ్రీపరంజ్యోతి, సర్వాంతర్యామియై ప్రకాశించును.




**152.“ఓం నిష్కారణాయై నమః”** : సర్వ సృష్టికి మూలకారణమైన ముగురమ్మల మూలపుటమ్మ, కార్యకారణములకు అతీతమై, సకలసృష్టిలో తరతమభేదములేక, సర్వము తానై వారి, వారి కర్తవ్యములు నిర్వహించే విధంగా అనుగ్రహించి, మేలు చేయును. పంచభూతములను, సకల బ్రహ్మాండమండలము సక్రమంగా తమ కర్తవ్యము నిర్వహించేలాగ, పర్యవేక్షించును. శ్రీకరుణాశక్తికి నమస్కారము.

**153.“ఓం నిష్కళంకాయై నమః”** : పూర్ణచంద్రబింబములోనైనా, కళంకము (మచ్చ) వున్నదిగానీ, సహస్ర సూర్యప్రకాశసంయుక్త, నిష్కళంకమైన తేజస్సుతో వెలుగు దివ్యతేజోమయికి నమస్కారము.

**154.“ఓం నిరుపాధై నమః”** : శుద్ధస్ఫటికతేజోరాశి, చిదగ్ని సంభూత, శ్రీపరంజ్యోతి స్వరూపిణి, నామరూప గుణరహిత, అన్ని రూపనామగుణములు తానై ప్రకాశించు జ్యోతిర్మయి బాహ్య ఉపాధిలేకనే సర్వాంతర్యామియై వెలుగును. రూపమున గొల్చితే, ఆ రూపము తానై అనుగ్రహించును. తన తేజముతో, తానె వెల్గును. రూపరహితమయిన, నిర్గుణ ధ్యానములో, స్వప్రకాశమైన స్వస్వరూపసంధానము కల్గచేయును. శుద్ధ స్ఫటికమువలె, శుద్ధ ప్రకాశమై, శుభ్రమై, స్వప్రకాశిని, శుద్ధ తత్త్వమున తేజరిల్లు శ్రీనిరుపాధికి నమస్కారము.

**155.“ఓం నిరీశ్వరాయై నమః”** : ఈశ్వరునిలో ఐక్యమై, ఏకమైన, పరమేశ్వర, అర్ధనారీశ్వరులై, ఒకే శరీరమున ప్రకృతి,పురుష సంయోగ సంకేతమై, సృష్టికి మూలకారణమై వెలుగు సర్వేశ్వరి, నిరీశ్వర, ఈశ్వరుడే తాను, తానే ఈశ్వరుడై సకల కార్యనిర్వహ జేయును. ఒకరు వాక్కు, మరొకరు అర్థం. ఒకరు ప్రకాశం, మరొకరు విమర్శ. శివశక్తులు, ఆదిదంపతులకు ఆత్మప్రదక్షిణ నమస్కారం.

(సశేషం)



# ప్రేమమయుడే పూర్ణమానవుడు

ఆర్.కైలాసరావు, శ్రీషిర్డీసాయి సేవామందిరం, ఉప్పాడ, తూ.గో.జిల్లా

అంతా సాయిమయం అయినప్పుడు ఆయనకు అర్పించడానికి నావద్ద నాది అన్నది ఏమున్నది? ఏదీ లేదు కదా ! ఇంకేమి అర్పించాలి? ఈ శరీరం, సంపద, స్థితి, అదీ ఇదీ అనేమిటి అన్నీ ఆయన ప్రసాదించనవే కదా! శ్రీకృష్ణపరమాత్మ చెప్పినట్లు, కర్మఫలాలను అర్పిద్దామనుకుంటే ఆయనకు అర్పించడానికి అర్హమైన సత్ఫలితాల నిచ్చే కర్మలా నేను చేసేవి అనే సందేహం కలుగుతుంది. చెట్లకు కాచే ఫలాలు కూడా మంచివి కాకుంటే భగవదర్పణకు అనర్హములే. పోనీ నా జీవితాన్నే అర్పిద్దామంటే "అదెప్పుడో నాపరమయింది, మళ్ళీ ఎలా ఇస్తావు?"అంటాడేమో? ఇలా సాగుతున్న నా ఆలోచనలకు జవాబుగా శ్రీసాయినాథుడు ఒక మహాత్ముని సందేశరూపంలో చక్కని మార్గం చూపారు. భగవంతునికి మనం అర్పించ గలిగినది ప్రేమ ఒక్కటే. ఇదే ఆ సందేశం. అయితే పరమాత్ముడైన శ్రీసాయినాథునికి అర్పించే ప్రేమ అత్యున్నతము, అమలినము అయి వుండాలి కదా ! అదెలా నావంటి సామాన్యునికి సాధ్యం? ఇలా ఆలోచిస్తుంటే శ్రీసాయికృపవలన నేను అప్పుడప్పుడు చదివిన మహాత్ముల భావాలు అనేకం కలసికట్టుగా నాలో చోటు చేసుకొని మార్గాన్ని చూపాయి. మరల మరల మననం చేసుకోవలసినవిగా తలచి ఆ భాగాలను



అక్షరరూపంలో జాగ్రత్త చేసాను. భక్తవరేణ్యులయిన మీతో ఆ భావాలను పంచుకోవాలని, తత్ఫలితంగా మీలోని దివ్య భావాలను తెలుసుకొనే అవకాశం కలుగుతుందనే ఆశతో దీన్ని మీ ముందుంచుతున్నాను. అర్హమైన విషయాలేమైనా వుంటే సహృదయంతో స్వీకరించమని, అనర్హమైన విషయాలుంటే ఈ అజ్ఞానిని మన్నించమని విధేయుడై వేడుకుంటున్నాను.

మానవుడు సంఘజీవి. ఒంటరిగా జీవించలేడు. భగవద్దర్శనాన్ని లేక ఆత్మదర్శనాన్ని కోరే తాపసులు, సాధకుల మాత్రమే ఏకాంతాన్ని ఇష్టపడతారు. మిగిలిన వారందరూ తన వారన్న వారిని కొందరినైనా దగ్గరు చేసుకుంటారు. శుభకార్యం యొక్క ఆనందాన్ని నలుగరితో పంచుకోవాలనుకుంటారు. కనుకనే తెలిసిన వారందరినీ ఆహ్వానిస్తారు. దుఃఖంలో, కష్టంలో ఇతరుల సహాయసానుభూతులు, ఓదార్పు కోరుకుంటారు.

ఆత్మ అంటే నేను అని అర్థం. ఆత్మీయులు అంటే నావారు. నావారు అనే వారిపై చూపే అభిమానమే ఆత్మీయత. ఎక్కువగా అభిమానించడమే ప్రేమ. ఆత్మీయత యొక్క సంపూర్ణత్వమే ప్రేమ. మానవుడు తన వారి సుఖసంతోషాలు కోరుతాడు. దానికై పాటు పడతాడు. ప్రేమను తనవారికే పరిమితం చేసుకోవడం ఎక్కువగా చూస్తూవుంటాం. అయితే ఆ ప్రేమ కూడా వ్యక్తులను బట్టి వివిధ స్థాయిల్లో వుంటుంది. భార్యాభర్తల మధ్య వుండే ప్రేమ ఒక స్థాయి అయితే, పిల్లలపై తల్లి ప్రేమ ఒక స్థాయి, తండ్రి ప్రేమ వేరొక స్థాయి. తల్లితండ్రులపై పిల్లల ప్రేమ మరొక స్థాయి. బంధువులపై ప్రేమ ఒక స్థాయి అయితే,

స్నేహితులపై ప్రేమ వేరొకస్థాయి. అవసరార్థం చూపే ప్రేమ నీచస్థాయి. ఉత్తమమయినది తల్లిప్రేమ. దాన్ని మించినదిగా వుండాలి దైవంపై మన ప్రేమ.

ఇతరుల కష్టసుఖాలు కూడా మన కష్టసుఖాల వంటివే అని గుర్తించగలిగితే, ఆ భావన మన మనస్సులో స్థిరపడితే ఇతరులను కూడా మన వారి వలెనే ప్రేమించగలుగుతాం. "నీ సాటివారు నీకేం చెయ్యాలను కుంటారో, నీవు వారి కలాగే చెయ్యి", అనే బాబావారి బోధనకు అర్థం అవే కావచ్చు. ముందుగా మనం ఇరుగు పొరుగు వారిని, నిత్యం మనం కలిసేవారిని, తరుచూ కలిసేవారిని ప్రేమించటం అలవాటుచేసుకోవాలి. క్రమంగా మన ఊరు, మన ప్రాంతం, మన రాష్ట్రం, మన దేశం ఇలా ప్రేమ పరిధిని పెంచుకుంటూ పోయి, ప్రపంచ ప్రజలనందరినీ ప్రేమించగలిగే స్థాయికి చేరుతుంది. సర్వమానవ ప్రేమతో మనస్సు నిండిన తర్వాత అవి పొంగి పొరలి ఇతర జీవులపై వర్షించడం ప్రారంభమై క్రమంగా అదే మన ప్రవృత్తిగా మన స్వాభావిక లక్షణంగా మారి విశ్వప్రేమగా వర్థిల్లుతుంది. విశ్వప్రేమ యొక్క ఫలితంగా దైవంపై ప్రేమ ప్రారంభమవుతుంది. ఆ ప్రేమ వృద్ధిచెంది దైవాన్ని చేరుతుంది. నీ ప్రేమను అందుకున్న కరుణామయుడైన పరమాత్మ ఊరికే వుండగలడా? భగవంతుని అనుగ్రహం, ఆయన యొక్క ప్రసాదం, దయగా నీపై ప్రసరిస్తుంది. ఆ కటాక్షం నిన్ను సంపూర్ణమానవునిగా మారుస్తుంది.

నీ ప్రేమ నీవారికి మాత్రమే పరిమితమయితే అది ప్రేమతత్త్వం కాజాలదు. దాన్ని స్వార్థంగా భావించవచ్చు. దాని ఫలం స్వల్పం. పూర్వం మనదేశంలో గ్రామీణుల జీవితాలు ప్రేమకు నిలయంగా వుండేవి. ఒకరినొకరు పేర్లతో కాకుండా తాతా, బాబాయీ, మామ, అబ్బాయీ, అల్లుడూ, అన్నా, తమ్ముడూ, మనవడా, అత్తా, పిన్ని, అక్కా, చెల్లాయి, వదినా, మరదలా, కోడలా అంటూ బంధుత్వపు వరుసలతో ఆప్యాయంగా పిలుచుకుంటూ కులమతబేధాలు లేకుండా ఒకే కుటుంబంగా మెలిగే వారు.ఇప్పటికీ అరుదుగా మన గ్రామాల్లో ఇది చూడగలం. భారతీయ సంస్కృతి కాని సంస్కృతి వ్యాపించిన చోట్ల మాత్రం ఇది కనబడదు. అక్కడ కనిపించేది మిథ్యా గౌరవాలే. గ్రామాలలో పండుగలు, ఉత్సవాలు, జాతరలు, నవరాత్రులు మొదలైనవి అందరూ కలిసి చేసుకునేవారు. ఊరిలో ఎవరింట్లో పెళ్ళైనా ఊరంతా పెళ్ళివారే. నేడో వీధికో ఉత్సవం, పేటకో జాతర. ఎవరి దారి వారిదే. అందులోనూ పోటీయే. తమ గొప్పతనాన్ని ప్రదర్శించుకొనే ప్రయత్నమే. కొన్ని ఊర్లలో అయితే సంఘీభావాన్ని, ప్రేమను పెంచే ఈ తరహా కార్యక్రమాలే కరువయ్యాయి. వివాహానికి ఎందుకు ఆహ్వానిస్తారు? వధూవరులను ఆశీర్వదించమని కదా ! మనం చేస్తున్నదేమిటి? విందు, బహుమతులే ప్రధానమని, ఆ రెండు కొనిచ్చి, ఆశీస్సులందించవలసిన సమయానికి మాత్రం అక్కడ వుండటంలేదు. పూర్వం కష్టసుఖాలు కలిసి పంచుకోవడం వల్ల, ప్రేమ సజీవంగా వుండేది.

## ఈ నా హస్తం భాగ్యవంతమైనది, పవిత్ర స్పర్శ గలది" - (అధర్వణవేదం)



మన భావ చైతన్యమంతా మన శరీరంలో వివిధ అవయవాల ద్వారా ప్రచురింపబడుతూంటుంది. అందులో ప్రధానమైనది చెయ్యి. ఆ చెయ్యి ఆచరణశక్తికి స్థానం. దేనిని స్పర్శించినా, ఆచరించినా ఆ చేతులతోనే కదా !

కొందరి చేతులు తగిలితే చాలు మనలో దాగిన దుష్టశక్తుల్ని సైతం బైటపడవేస్తాయి. మరికొందరి హస్తస్పర్శ దుష్టభావాల్ని మనలో ప్రచురింపచేయవచ్చు. అది ఆయా వ్యక్తుల ఉత్తమ, అధమ సంస్కారాల స్థాయిని బట్టి ఉంటుంది.

మన భావనా శక్తిని కేంద్రీకరించి ప్రసరింపజేస్తే శరీరమంతా అది చేతనత్వం పొందుతుంది - ప్రత్యేకించి హాస్తాలలో.

మంత్రజపం, పూజవంటివి చేసేటప్పుడు కరన్యాసం, అంగన్యాసం చేస్తాం. అంటే మంత్రశక్తిని శరీరంలో ప్రవహింపచేయటానికి ముందుగా, చేతిలో ఉన్న ప్రతి వేలులోనూ, కరతలం (అరచేతుల) లోనూ ముందు శక్తిని 'న్యాసం (ఉంచడం)' చెప్తాం. ఆ చేతి స్పర్శతో శరీరమంతా మంత్రశక్తిని న్యాసం చేస్తాం. అంటే ముందుగా శక్తిని ప్రచురింపజేసుకొనే సాధనం హస్తమే.

ఈ హస్తంతోనే దీవించడం వంటివేగాక, గురువు శిష్యునకు ఇచ్చే దీక్షలలో హస్త స్పర్శ, దీక్ష అత్యంత ప్రాముఖ్యమైది. శిరస్సుపై హస్తాన్నుంచి





మహాత్ములు 'శక్తిపాతం' ద్వారా శిష్యుని అనుగ్రహిస్తారు. నిత్యదైవోపాసన ఉన్నవారి దక్షిణ హస్తంలో 'అగ్ని' నిహితమై ఉంటుందనీ, అందకే వారికి ఏదైనా దానం చేస్తే అగ్నికి అర్పించిన (యజ్ఞం చేసిన) ఫలం లభిస్తుందనీ సంప్రదాయం.

నియమంగా నిత్యం అనుష్టించే మంత్రాన్ని మనసా జపిస్తూ, రెండు అరచేతుల రాపిడి చేసి, ఆ మంత్రశక్తిని కరతలంపై ఆవహింపజేసినట్లు భావనచేసి వేడెక్కిన ఆ అరచేతిని ఏ వ్యాధిగ్రస్తుని లేదా అనారోగ్యపీడితుడ్ని శరీరానికి తాకించితే స్వస్థత శీఘ్రంగా చేకూరుతుంది. విభూతిని చేతుల్లో నుంచుకొని మంత్రించినా, ఆ అరచేతికున్న 'దివ్య శక్తి గ్రహణ' సామర్థ్యం ద్వారా ఆ విభూది శక్తివంతమవుతుంది.

మనలో చక్కని భావాలతో, ప్రేమ పూర్వకమైన ప్రశాంత చిత్తంతో, దైవాన్ని ధ్యానించి దేనిని స్పర్శించినా మన చేయి పవిత్రతను ప్రసాదించగలదు.

భగవత్‌శక్తి ప్రసరణకు స్థానభూతంగా ఉన్నది. కనుక ఈ హస్తాన్నే 'భగవాన్' అన్నారు. అంతేగాక దాని స్పర్శ 'శివం' కరమౌతుందనీ 'శివాభి మర్మనః' అని వేదవచనము.





# అమూల్య సమయం

మానవజన్మ మాటిమాటికి ప్రాప్తించేది కాదు. మానవుని జీవితకాలం బహు అమూల్యమైనది. దీనిని సద్వినియోగం చేసుకుంటే భగవానుని కూడా పొందవచ్చును. అనుక్షణం సమయం గడిచిపోతునే ఉంటుంది. మన సమయాన్ని సర్వదా భగవత్ప్రాప్తికోసమే వినియోగించాలి. మన హృదయము భగవానుని మందిరము. నోరు, చెవులు, కన్నులు మందిరం యొక్క ద్వారాలు. వీనిని ఎప్పుడూ భగవానుని గురించి తెరచివుంచాలి. నోటితో నిరర్థక ప్రసంగాలు ఏవీ చేయరాదు. చెవులతో ఇతర విషయాలు వినరాదు. కంటితో ఇతర దృశ్యాలను చూడరాదు. మనస్సులో ఇతర విషయాలకు చోటు ఇవ్వరాదు.

భార్యాబిడ్డలు, ఐశ్వర్యం, ధనం, శరీరం, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు, జీవితము, ప్రాణము... ఈ సర్వమూ భగవానుని వలననే మనకు ప్రాప్తించాయి.

ఏ మానవుడు పూర్తిగా భగవానుని మీద ఆధారపడి ఉంటాడో వాని గూర్చి భగవానుడు చింతిస్తూనే ఉంటాడు. వానికి కావలసిన యేర్పాట్లు భారం అంతా భగవానుడే వహిస్తాడు.

మానవుడు పరోపకారాన్నే తన పరమలక్ష్యంగా చేసుకొని తన జీవితాన్ని అంతనూ నిష్కామభావంతో, అందుకోసమే వినియోగిస్తాడో వానికి నష్టం అన్నది కలుగనే కలుగదు.

మన జీవితం ధన్యం కావాలి అనుకుంటే నిత్యమూ భగవన్నామ



జపము, స్వరూప ధ్యానము, పూజ, పాదసేవనము చేస్తూఉండాలి. భగవానుని పలుకులను ఆలకిస్తూ ఉండాలి. ఆయనకు ప్రణమిల్లుతూ ఉండాలి. ఆయనను ప్రభువగాను, తనని సేవకునిగాను ఎంచుకోవాలి.

నిత్యము భగవానుని ప్రార్తిస్తూఉండాలి. ఇదే మనకు నిజమైన ధనం. లోకంలో భగవద్భక్తితో, భగవానుని గుణ, ప్రభావ తత్త్వాలను విశేషంగా ప్రచారం చేయాలి.

రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు నిత్యమూ భగవానుని నామాన్ని, రూపాన్ని స్మరించుకుంటూ శ్రద్ధాభక్తులతో స్తుతిప్రార్థన చేసుకుంటూ శయనించాలి.

భక్తుడు శేషజీవితం అంతా నవ్వుతూ, ఆనందంతో చిందులు త్రొక్కుతూ హాయిగా పాటలు పాడుకుంటూ ముగ్ధుడు అవుతుండాలి.

తీర్థస్థలాలకు చేరినప్పుడు పుణ్యకార్యాలు చేయాలి. పెద్దలకు పాదాభివందనాలు చేస్తూ ఉండాలి. వారికి సేవలు చేయాలి. వారి ఆజ్ఞలను పాటించాలి. భగవానుని యందు భక్తి కలిగియుండాలి. గురువులకు, మహాత్ములకు త్రికరణ శుద్ధిగా సేవలు చేయాలి.



# లేఖలు

ఆర్యా !

'శ్రీసాయిదర్శన్' పత్రిక సర్వాంగసుందరంగా, సాయిలీలామృత రసగంగా ప్రవహంగా.... యావదాంధ్రసాయిభక్తజనహృదయావనిలో ప్రవహిస్తూ... భక్తిరస పారవశ్యంలో ముంచెత్తుతోంది. సాయితత్త్వాన్ని శ్రీసాయిదర్శన్ పత్రిక ద్వారా ప్రచారంచేస్తూ... చారిటబుల్ ట్రస్టుద్వారా సాయిసేవలు చేస్తున్న మీరెంతో పుణ్యాత్ములు. సాయికృపను పొందిన ధన్యాత్ములు. శ్రీసాయిదర్శన్‌లో ప్రచురిస్తున్న ప్రతి అక్షరం, ప్రతి పదం, ప్రతి వాక్యం, ప్రతి వ్యాసం నా మనసుకు ఎంతో ఊరటను, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, పారవశ్యాన్ని కలిగిస్తూ... నా మనసును పవిత్రం చేస్తుంటుంది. పత్రిక కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తుంటాను. ప్రతినెలా అందమైన ముఖచిత్రంతో అపూర్వమైన విధంగా సాయిలీలావిలాసాలతో, భక్తుల అనుభవాలతో ముస్తాబై వస్తున్న శ్రీసాయిదర్శన్ నిజంగా సాయిని కొత్త కొత్త కోణాల్లో, రూపాల్లో, భంగిమల్లో, భావచిత్రాలతో దర్శింపజేస్తుంది. ఈ పత్రికను చూస్తుంటే నాడు హేమాడ్‌పంత్, దీక్షిత్‌ల ఆధ్వర్యంలో వచ్చిన 'సాయిలీల' శ్రీశరత్ బాపూజీ గురువుగారి 'సాయిపథం' తర్వాత అంతే వాసిలో వస్తున్న ఏకైక సాయి సందర్శనాన్ని కలిగించే పవిత్ర పత్రికగా సాయిమానసపుత్రికగా గురుబంధువుల హృదయపు పూతోటలో భక్తిపరిమళాలు వెదజల్లేలతికగా... సాయిదర్శన్‌రావడం మా అదృష్టం.

సాయిపాదరేణువు
సాయి కృష్ణ,
ఛైర్మన్, శిరిడీ సాయి సత్యసంఘ చారిటబుల్ ట్రస్టు,
అనంతపురం.



ఆర్యా!

మన ఇష్టదైవమైన సద్గురు సాయినాథుని పాదపద్మములను నమ్ముకొని వారి మహామహిమోన్నతములను యావత్ ప్రపంచానికి తెలియపరచబూని, ఆ విషయయత్నంలో, జీవనదివోలె, మీరు చేయు మహత్తర యత్నానికి నా ధన్యవాదాలు. ఆ తండ్రి చల్లని దీవెనలు ఎల్లవేళలా మీకుండాలని, సర్వదా, తమను ఆ బ్రహ్మస్వరూపులు కాపాడలనీ, తమకు సంపూర్ణ ఆయురారోగ్యములు ప్రసాదించాలనీ మనసారా, నా తండ్రి సాయినాథుని వేడుకుంటున్నాము.

సాయినాథుని దయవలన మీరు అతి స్వల్పకాలములో నా మనసునందు ఆత్మీయత నింపి వ్యక్తులుగా గుర్తింపు పొందిరను విషయము గుర్తుచేస్తూ నా మనసులోని అభిప్రాయాలు తమతో ఈ లేఖద్వారా తెలుపుకుంటున్నాను. అన్యదాభావించరని ఆశిస్తూ, సమయాన్ని తీసుకొని లేఖాంశాలను చూడగలరని మనవిచేస్తూ -

సర్,

అర్జునుని పుణ్యంవలన భగవద్గీత పుట్టినట్లుగా మీ పుణ్యంవలన సకల దేవతా స్వరూపులైన సాయినాథుని జీవితవిశేషాలు భక్తుల అనుభవాలు మీ విశేష ప్రయత్నాలు సఫలీకృతమొనర్చుకార్యాలు, దివ్య అద్భుత వాక్కులు, ఎద ఎదలో నింపుకొనుభాగ్యం మాకు కల్గింది.

ఒకనాటి దినపత్రిక మీ విషయప్రస్తావనంగా కించిత్ ఆలస్యంచేయక తమకు మనవి చేయగా, నా పాలిట కల్పవృక్షమై నాకు భగవంతుని పత్రిక ప్రతిమాసం అందజేస్తున్నందుకు సదా తమకు ఋణపడి వుంటాను.

మీరు ప్రచురించిన అనేక విషయాలు నన్నెంతగానో ఆకర్షించాయి. నా మనోవేదనను దూరం చేసాయి. ఆత్మానందాన్ని నింపాయి. బాబావారి మాటలు ఎంతగానో ఊరటనిచ్చింది.

తెలవనితనంతో మాటల్లో మాటగా కొందరిపై దురభిప్రాయం వ్యక్తపరచానేమోనని నా మనసునే సమీక్షించుకున్నాను. ఏది ఎట్లయినా ఇతరులను ఏ సందర్భంగాకూడా నిందించరాదని జీవితలక్ష్యంగా పెట్టుకున్నాను. దీని విషయంలో నా చుట్టు నేనే గిరి గీసుకున్నట్లు భావించుకుంటున్నాను. ప్రతిక్షణం

బాబావారు అన్నట్లు "పరులను నిందిస్తే నన్ను నిందించినట్లే" అనిన బాబావారి అమృతవాక్కులను నా మనోఫలకంలో పొందుపరచుకున్నాను. దీని విషయంలో నా ధర్మపత్ని మాధురీ, నా చిరంజీవులు కూడా.

"ఆకలితో నున్న జీవికి మొదలుపెట్టి, ఆ తర్వాత నీవు భుజించుమని" బాబావారు అన్నట్లు ఇట్టి విషయంలో సాధ్యమైనంతవరకు నా ప్రయత్నలోపం లేకుండా నడుచుకుంటానని దీక్షబూనాను.

ఇలా ఒకటేమిటి మీ పత్రిక చూసి ఆ తండ్రి లీలలకు ముగ్ధుడనై ఎన్నో విషయాలు గ్రహించి నా మనస్సును నిగ్రహించుకొని సమీక్షించుకొనుచు ప్రతిరోజు ఒక కొత్తదనంతో ఏ లోపం లేకుండా నా జీవనయానాన్ని కొనసాగించుచున్నాను. అంతా ఆ తండ్రి కృపవలననే ! మీ సహాయంవల్లనే ! తెలుసో, తెలియకో నా జీవితంలో ఇదివరకు ఎన్ని స్వల్పపలోపాలు నావలన జరిగినవోకాని, మీ పత్రిక చూసిన మరుక్షణంనుడి ఏ లోపం జరుగనీయకుండా జాగ్రత్తపడుతున్నాను. నేను కాదు, నా ధర్మపత్ని, నా చిరంజీవులు కూడా.

దీక్ష పూనాము.

చంద్రుడు కలువలకు ఆనందము నిచ్చినట్లే బాబావారి మహిమాన్విత పుస్తకం మాకు ఆనందము నిచ్చుచున్నది. అది తమ సహకారమువలననే.

''సద్గురు సాయినాథుని కృపవలన సాయిభక్తులైన'' తమరు నాలాంటివారికి పరిచయమైనందుకు నా అదృష్టంగానే భావిస్తున్నాను.

బాబా మీ రూపంలో నా జీవననౌకకు త్రోవ చూపాడని ఆత్మానందాన్ని పొందుతున్నాను. నా జీవన నౌకకు మరికొన్ని సలహాలత్రోవను సూచించగలరని ఆశిస్తూ, ధన్యవాదములతో

తమ విశ్వసనీయుడు

- వై.కృష్ణయ్య, తెలుగు లెక్చరర్, ఎస్.వి.జి డిగ్రీకాళాశాల,
లక్ష్మణచాంద, ఆదిలాబాద్ జిల్లా

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80 Ph : 27611864, on behalf of Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**